



కథ

# ఒంగోలు టేసను కాడ..

కాట్రగడ్డ దయానంద్

ఉత్తరం వెళ్ళే ప్యాసింజరు రైలూ దక్షిణం వెళ్ళాల్సిన ప్యాసింజరు రైలు నిజానికి ఈ స్టేషనులోనే కల్సుకోవాలి. అదీ సంధ్య చీకట్లు ముసరక ముందే సూర్యాస్తమయం కాగానే జరిగి పోవాలి. అలా జరగడమనేది రైల్వే వారి టైంటేబుల్స్‌లోనో వారి గోడల మీది రాకపోకల పట్టికలోనో తప్ప నిజంగా జరగడం చాలా అరుదు.

తూర్పు వైపున్న ప్లాటు ఫారమ్మీదనుంచి ఒక కాకి పిల్లవాడు సగం తిన్న పాప్‌కార్న్ ప్యాకెట్టును తన్నుకుని చెట్ల వైపుకు ఎగిరిపోయింది. పిల్లవాడి ఏడుపూ వాడి అమ్మ సముదాయింపూ వచ్చే రైలు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణీకుల రొదలో కల్సిపోయింది. ఉత్తరం వైపు వెళ్ళిపోయిన ప్యాసింజరుతో పాటు ఖాళీ అయిన ప్లాటు ఫారమ్మీద తపాలా సంచుల్ని మోసుకెడుతున్న ట్రాలీబండి చక్రాలు గ్రీజు లేక ఎండిపోయి ట్రాలీలాగే వాడి హృదయంలానే కుయ్యి కుయ్యిమని అరుస్తున్నాయి. సరిగ్గా అప్పుడే దక్షిణం వైపు వెళ్ళే బండికి గంటకొట్టేరు.

ప్రయాణీకుల్లో హడావుడి ఎక్కువైంది. కాస్తముందుకూ కాస్తవెనుకకూ సర్దుకుంటున్నారు. మృదువుగా, నిర్మలంగా ఉన్న కళ్ళజోడు అమ్మాయికి, ఆమె ముసలి తండ్రికి కాస్త ఎడంగా నుంచున్న నలుగురు అబ్బాయిలు చాలా సేపటి నుంచి ఆమెను చూపుల జడివానలో తడిపేస్తూ క్రూరానందాన్ని అనుభవిస్తున్నారు. ఆ అమ్మాయి సుకుమారంగా, సరళసరళంగా లలితలలితంగా ఉంది. ద్రాక్షతీగెలా మరీ కోమలంగా ఉంది. అప్పుడే స్కూలు నుంచి కాలేజీలో అడుగిడాల్సిన ఎటూ తేలని వయసులో ఉంది. ఆ అమ్మాయి, ఆమె ముసలి తండ్రీ స్టేషనులో అడుగిడినప్పటి నుంచి ఆమెను ఆనలుగురూ నేత్రహింస పెడుతున్నారు. అటూఇటూ తిరుగుతూ జనం మధ్యలో చొచ్చుకుని ఆరద్దీగా ఉన్న ప్లాటు ఫారమ్మీద ఆ అమ్మాయిని తగిలీ తగలనట్లు రాసుకుపోతున్నారు. మొదట్లో పట్టించుకోక పోయినా తర్వాత్తర్వాత వాళ్ళ ప్రవర్తన ఆమెకు అసహ్యం కల్గిస్తోంది. భయం కలిగిస్తోంది. తండ్రి చేయిపట్టుకుని వాళ్ళకు దూరంగా వెళ్ళి నిలబడుతోంది. మళ్ళీకొద్ది సేపటికి ఆమెకు చేరువవుతున్నారు వాళ్ళు. ఆ అమ్మాయి కళ్ళల్లోని భావాలు తెలీనీకుండా ఆకళ్ళజోడు పొదువుకుంది గాని ఆమె నిలబడిన తీరు మాత్రం భయంతో వణుకుతున్న లేడికూనను తలపిస్తోంది.

ఛాయ్, కాఫీ, టిఫిన్లూ, మ్యాగజైన్ల బళ్ళవారు జనాన్ని చీల్చుకుంటూ వాళ్ళతో తిట్లు తింటున్నారు.

ఇంతలో ప్రయాణీకుల్ని నెట్టుకుంటూ ఒక ఆడమనిషీ ఒక మనిషీ ప్రశాంతంగా ఉన్న ప్లాటుఫారం ఆచివరి నుంచి జనం కెరటాల హోరును తప్పించుకుంటూ ఈ చివరిదాకా ఎవర్నో వెదుకుతూ చూపుల జల్లెడ పడుతున్నారు. ఆడమనిషి ముతక చీర కట్టి పుగాకు నముల్తూ ఆకులన్నీ కోల్పోయిన పొగ కట్టెలా ఉంది. ఆమె ముతక ముతగ్గా చీదర చీదరగా ఎండకు ఎండి వానకు తడిసిన పాత తోలు చెప్పులా ఉంది. మగమనిషి కాస్త తెల్లగా ఉన్న పంచె, చొక్కా ధరిచి ఉన్నాడు. మనిషి ఇప్పుడిప్పుడే ఎండాకాలం భూగర్భ జలాన్నంతా పీల్చేసి విస్తరించుకుంటున్న జపాన్ తుమ్మచెట్టులా ఉన్నాడు. వాళ్ళిద్దరూ ప్లాటుఫారమంతా కలియ తిరుగుతూ మొరటుగా కనబడుతున్న వాళ్ళనూ, వాళ్ళతో ఉన్న సామాన్ల సంచుల్నీ పరీక్షగా చూస్తున్నారు. గోనెసంచులు కనబడిన దగ్గర ఆగి మరీ పరీక్షగా చూస్తున్నారు.

మెల్లిగా చీకటి ముసురుకుంటోంది. అంతకు ముందే రైల్వే వాళ్ళ లైట్లు వెలిగేయి కాబట్టి ప్రయాణీకులకు అంతకు ముందెప్పుడో చీకటి ముసిరినట్టు లెక్క. దూరాన ఉత్తరం వైపునుంచి రైలు ఇంజను హెడ్‌లైటు పట్టాల మలుపులోంచి చీకటిని చీలుస్తూ గొప్ప తేజాన్ని ప్లాటుఫారం వైపు ప్రసరింప చేసింది. మరికొద్ది సేపటికి జనం గుండెల్ని హడావుడిపెడుతూ ఏహడావుడీ లేని దగ్గరకెళ్ళి ఆగింది ఇంజను.

ఇంజను ఆపకుండానే డ్రైవరు కిందికిదిగి తలకుకట్టుకున్న చిన్న టవలును విప్పివిదిలించి ముఖం కడుక్కోవటానికి ప్లాటు ఫారమ్మీద పంపు దగ్గరకొచ్చేడు. ఆ నీళ్ళ

పంపుకు కాస్త ఎడంగా ఉన్న వాడని లెట్రిన్ వాకిలి బయట చొక్కా లేకుండా ముడుచుక్కూర్చున్న ఒక పిల్లవాడి మొఖం రైలు వైపుకు తొంగి చూచి వికసించింది. ఆ వెనుక వాడి సైగనందుకుని ఒక పదేళ్ళ పిల్లవాడు నెత్తిన చిన్న గోనెసంచీ మూటతో, పద్నాలుగేళ్ల పిల్ల మరొక పెద్ద మూటతో బయటికొచ్చి ఆగిన రైలువైపు సాగిపోయేరు. ఇంజను వెనక వైపున పెట్టె తలుపు దగ్గర రద్దీ ఎక్కువగా ఉంది. మెల్లిగా ముసలి తండ్రిని పెట్టెలోకి చెయ్యిపట్టుకుని ఎక్కిస్తూన్న ఆ అమ్మాయిని అనుకుంటూ అనలుగురూ ఆపెట్టె ఎక్కడానికి తయారయేరు.

"ఒరేయ్ శీను! ఈడ ఎక్కలేంగాని పట్టాలు దిగ్గి బండి ఆపక్కకు నడవరా" అంది ఆ అమ్మాయి హడావుడిగా మళ్ళీ వాళ్ళిద్దరూ వెనక్కి తిరిగి ఇంజను వైపు పరుగెత్తుతున్నట్లు నడిచేరు.

అప్పుడు వినబడింది ఆకేక "ఒసేలం....! ఆగవే" అని


ఆకేక వినబడిన వైపు అందరూ చూచేరు ఒక్కక్షణం.

ఆ తరువాత "పోతున్నారు! పోతున్నారు! పట్టుకో! పట్టుకో!!"

నెత్తిన మూటలతో హడావుడిగా వెడుతున్న ఆడపిల్లనీ, మగపిల్లవాడినీ వెంబడిస్తూ ఒక ఆడమనిషీ, ఒక మగమనిషీ! మగమనిషి పరుగెత్తుతూ వెళ్ళి పట్టాల మీదికి దిగుతున్న ఆడపిల్ల జుట్టును పట్టుకుని బలంగా వెనక్కి లాగేడు. ఆ ఊపుకు ఆ అమ్మాయి తడబడుతూ నెత్తిన బరువును మోయలేక ఊగిపోతూ గోనె సంచీని కిందపడేసింది. ఆడమనిషి పిల్లవాడి చొక్కా పట్టుకుంది. వాడు ఆగగానే నెత్తిన మూటను విసురుగా దించి కింద పడేసింది.

"ఏంది? ఏంది?" అంది అదురుపాటు గొంతుతో ఆ అమ్మాయి ముతగ్గా ఉన్న ఆ ఆడమనిషి తీక్షణంగా చూచి ఆ మూటలు రెండూ మూతులు విప్పికింద విదిల్చింది. బొలబొల మంటూ రాలేయి ఎముకలు. చిన్నవీ, పెద్దవీ, లావువీ, సన్నవీ, వికృతంగా ఉన్నవీ, విచిత్రంగా ఉన్నవీ... అన్నీ పశువుల ఎముకలు. ఒక్కసారిగా నీసు వాసన గుప్పుమంది అక్కడ.

మరొకసారి తీక్షణంగా చూస్తూ "ఏంది ఏందని నంగనాచిలా అడుగుతున్నావు కదే బేవార్సుదానా? నాతో మధ్యానం ఎవారం చెప్పినట్టే చెప్పి, ఎముకలు అమ్మడాని కొచ్చి




నట్టు వచ్చి, బేరమాడి కుదరనట్టుగానే వెళ్ళి, నేను కూటికి పోయినప్పుడు మారాసుల మీద నుంచి బంగారంలాంటి ఎముకల్ని మూట కట్టుకునొచ్చేరు కదే! నీతో పాటుండాల్సిన ఆ కుంటోడేడీ?" అడిగింది ఆముతక మనిషి.

"లేదమ్మా! అయ్యి మీరాసుల్లోయి కాదమ్మా! ఊరిబయటంతా తిరిగి ఏరుకొన్నామమ్మా! మమ్మల్నొదిలెయ్యి తల్లీ! బండి కదులుద్ది!" అంది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి ముఖం భయపడినట్టుగా ఉంది. పెరగడానికి పొడుగు పెరిగింది గాని, కిందపడ్డ ఎముకల్లోని సన్నపాటి ఎముక మాత్రం లేవు ఆ అమ్మాయి కాళ్ళు చేతుల లావు. ఒంటి మీది చిరుగుల గుడ్డలు మాసి ఆఎముకల వాసనే వేస్తున్నాయి. చేతులకు మెడలకూ ఏదో దారాలు వేలాడుతున్నాయి.

"మార్కెటు నీయమ్మ మొగిడిదను కున్నావా? ఈ ఊళ్ళో గొడ్డు ఎముకల యాపారం చేసేది ఈ ఏసోబొక్కడేనే! ఈ ఊళ్ళో ఎముకలన్నీ నేనేకొనాల. నేనేయాపారం చేయాల. అంతడబ్బు పెట్టి మార్కెటు పాట పాడింది మీ ఎదాన పొయ్యటానికా? అయినా, మిమ్మల్ని కాదే అనాల్సింది! నెలనెలా జీతమిస్తూ దీన్ని కాపలాకు పెట్టుకుంటే ఇది ఏడ కులకటానికెళ్ళిందో దీన్ని అనాల" అన్నాడు. ఆడమనిషి వైపు తిరిగి అతుమ్మ మొద్దులాంటివాడు. ఆ మాటతో ఆ ఆడమనిషి ముఖం మర్రింత కఠినంగా మారింది.

ఆమె జుట్టు పట్టుకుని వంచి గుభీగుభీ మని రెండు గుద్దులు గుద్దింది వీపు మీద.

"మాయక్కను వదిలేయమ్మా! కావాలంటే వీటిని మీరే తీసుకెళ్లండి!" ఆడమనిషికి అడ్డువస్తూఅన్నాడుఆపిల్లవాడు.వాడు బాగా అరిగిపోయిన చీపురులా కుదిమట్టంగా ఉన్నాడు.

బండి ఎక్కడానికి వెడుతున్న ముగ్గురు నలుగురు మనుషులు వాళ్ల చుట్టూ మూగేరు. బండికి ఇంకా సిగ్నల్ పడకపోయే సరికి డ్రైవరు ప్లాటుఫారాన్నంతా తన చూపుల్తో తడుముతున్నాడు.

ఆ ఆడమనిషి పెద్ద ఎముకలన్నిట్నీ ఒక పక్క, చిన్న ఎముకలన్నిట్నీ మరోపక్క వేసింది. పెద్ద ఎముకల్ని చూపిస్తూ "ఇవి మన రాశుల్లోంచి తీసినయి! అవి ఏరుకున్నవి. వాటిని వదిలేద్దాం!" అంది మగమనిషితో

"నీకు తలకాయ లేదే బుద్ధిలేనిముండా! అంతా అరవైదెబ్బైకి లోలకు తక్కువుండదు సరుకు! కిలో మూడ్రూపాయల లెక్కన ఎంతవుద్దో చూచేవా? దొంగతనం చేసిందానికి పోలీసోల్ని పిలవక ఇంకా జాలితలుస్తావేమే?' ఎముకలన్నిట్నీ ఒక దగ్గర కలిపేస్తూ అన్నాడు వాడు.

"అన్నా! అన్నా! ఈసారికి వదిలెయ్యన్నా!! ఆ చిన్నయ్యన్నా వదిలెయ్యన్నా! పొద్దుట్నుంచి తిరిగి తిరిగి ఏరుకొచ్చేమన్నా! మూడు రోజుల్నుంచి కడుపుక్కూడ లేక ప్రాణం బేజారైందన్నా! నీకు దణ్ణం పెడతా వదిలెయ్యన్నా!' వేడుకుంది ఆ అమ్మాయి మగమనిషి చేతుల్ని వెనక్కితోస్తూ!

"ఒసే నాచేతుల్నే తోసినన్నేనెడతావే!" అంటూ అదే అవకాశంగా తీసుకుని ఆపిల్ల గుండెల మీద చేతులు వేసి మొరటుగా నలిపేడు వాడు.

కెవ్వుమని కేకేసింది ఆ అమ్మాయి. చూస్తున్న అయిదారుగురు మనషులు తమ కేమీ పట్టనట్లు అక్కడ నుండి కదలివెళ్ళేరు. వాడు అక్కడకే చాలనుకుని లోపల్లోపల వికృతంగా ఆనందిస్తూ వాటన్నిట్నీ ఒకరాసి

చేసి ఆడమనిషి వైపు తిరిగి వంకరగా నవ్వుతూ "పోలీసులొద్దూ! ఏమొద్దులే! పోయిగోతాలు తీసుకురా. మోసుకుపోదువుగాని" అన్నాడు వాడు. ఆడమనిషి కదిలివెళ్ళింది.

రైలుకు సిగ్నల్ ఇచ్చేరు. డ్రైవరు హారన్ మోగించేడు. వాడు బీడీ వెలిగించి తృప్తిగా ఆ ఎముకల సామ్రాజ్యానికి చక్రవర్తిలా నిలుచున్నాడు. జనం ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. బండి కదలటానికి సిద్ధంగా ఉంది.

వాడు బీడీ వెలిగించగానే ఆఆడపిల్లా, ఆ పదేళ్ళ పిల్లవాడూ మెల్లిగా లెట్రిన్ వైపు కదిలేరు. ఆ తరువాత ఇద్దరూ మళ్ళీ చెరొక మూటానెత్తిన పెట్టుకుని పరుగెత్తుతూ ప్లాటుఫారమ్మించి పట్టాలమీదికిదిగి చీకట్లో కలిసేరు.

వాడు అటుచూచేసరికే బండిని మెల్లిగా కదిలించేడు డ్రైవరు.

దుబ్బలా ఉన్నవాడు బండగొంతుతో "అమ్మలం...! సరుకు ఇంకో అరవై కిలోల్దాకా పట్టుకు పోతున్నారుకదే! మోసం చేసేరుకదే" అని అరిచేడు. ఇంజనులో నుండి డ్రైవరు తల బయటనే ఉంచి చిన్నగానవ్వేడు.

ఆ వెంటనే చొక్కాలేని కుంటిపిల్ల వాడొకడు ఆదుబ్బ మనిషి చేతిని కరిచి కొరికి వాడు తేరుకునే లోగానే ఎగురుకుంటూ వెళ్ళి ఇంజను వెనక పెట్టెను అందుకున్నాడు. ఆ పెట్టెలోనే ఎముకల సంచుల్ని సీటు కింద సర్ది వాకిట్లోకి వచ్చి నుంచున్న ఆ అమ్మాయి దాటి వెడుతున్న వాడిమీద గుండెల్లో నుంచి కాండ్రించి ఊసింది. వాడు తిట్టిన బూతు మూట రైలు శబ్దంలో కల్సిపోయింది. ఆ అమ్మాయి లోపలకు రాగానే పెట్టె అంతా ముక్కలు మూసుకుంది పువ్వులా సుతారంగా ఉన్న ఆ అమ్మాయి తప్ప.

ఆ అమ్మాయి ఎందుకనో మసిలా మొరటుగా ఉన్న ఈ అమ్మాయిని చూచి సుకుమారంగా నవ్వింది. ఇందాకటి నుంచి ప్లాటుఫారం మీద జరిగిన దంతా కిటికీలోంచి చూచిన ఆ అమ్మాయి నిదారుగా కూర్చుని ఎదురు సీట్లలో కూర్చున్న ఆనలుగు రబ్బాయిల వైపు కళ్ళద్దాలు తీసి తీక్షణంగా చూచింది.

● ● ●

# అద్భుత ప్రయోగాలకు దర్పణం తెలుగు కథ

తెలుగు సంస్కృతీ వికాసానికి కథా రచయితలు ఎంతగానో దోహదం చేశారని ప్రసిద్ధ కథారచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. అభ్యుదయ రచయితల సంఘం గుంటూరు జిల్లా శాఖ, శ్రీపులుపుల వెంకట శివయ్య స్మారక కమిటీల ఆధ్వర్యాన నవంబర్ 15వ తేదీ గుంటూరు కవి కళాశాలలో జరిగిన శ్రీ శివయ్య 86వ జయంతి సభలో శ్రీ కేతు 'తెలుగు కథ - ఇటీవలి ధోరణులు' అనే అంశంపై ప్రసంగించారు.

తెలుగు కథ గత ఇరవై సంవత్సరాలలో ఎంతో అభివృద్ధిని సాధించిందని అద్భుత ప్రయోగాన్ని చేసిందనీ, జీవన విస్తృతిని చూపటమే గాకుండా ఎంతగానో భాషా సేవ చేసిందని ఆయన వివరించారు. ఇటీవలి తెలుగు కథ వర్తమాన గతంతో సంబంధం పెట్టుకుంటూ భవిష్యత్‌ను నిర్మించుకువాలనే కృషితో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

అమరజీవి పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం క్రింద వెయ్యి నూటపదహార్లనగదు, జ్ఞాపిక, శాలువాతో ప్రొఫెసర్ కేతు విశ్వనాథ రెడ్డిని సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు డాక్టర్ కె. రామమోహన్‌రాయ్ సత్కరించారు.


డాక్టర్ రాయ్ ఈ సభలో ప్రసంగిస్తూ రచనను సాంఘిక బాధ్యతగా గుర్తించిన మహా రచయితగా శ్రీ కేతు విశ్వనాథరెడ్డిని అభివర్ణించారు.

సభాధ్యక్షత వహించిన ప్రముఖ కథా రచయిత, అ.ర.సం. నాయకులు శ్రీ గోపరాజు నాగేశ్వరరావు ప్రసంగిస్తూ శ్రీ శివయ్య యువకులను కమ్యూనిస్టులుగా మలచడంలో ఎంతో కృషిచేశారని అన్నారు.

కీ.శే. శివయ్య చిత్రపటానికి తొలుత శ్రీ కేతు విశ్వనాథరెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు.

నైజీరియా ప్రజా రచయిత, ప్రజా వుద్యమ నాయకుడు కెన్‌సారో వైవాను, ఇతర ఉద్యమ నాయకులను అక్కడి మిలటరీ ప్రభుత్వం ఉరితీయటాన్ని సభ ఖండిస్తూ వారికి సంతాపంగా మౌనం పాటించారు. గుంటూరు జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత కోసం సాక్షరతా సమితి చేపట్టిన వుద్యమానికి అరసం మద్దతు తెలిపింది.

అభ్యుదయ రచయిత సంఘం రాష్ట్ర విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ పరుచూరి రాజారాయ్ తొలుత స్వాగతం పలికారు. జిల్లా శాఖప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ వందన సమర్పణ చేశారు.



గుంటూరులో అరసం ఆధ్వర్యాన జరిగిన పులుపుల శివయ్య జయంతి సభలో డా॥ రామ్మోహనరాయ్‌నుండి సాహితీ సత్కారాన్ని స్వీకరిస్తున్న ప్రొఫెసర్ కేతు విశ్వనాథ రెడ్డి.